సాక్షి నంద్యాల

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఇసుక బుకింగ్‌లో టోకెన్ల దందా

ఇసుక పర్మిట్ల జారీకి అధికారులు టోకెన్ల విధానం తేవడంతో కొందరు వ్యక్తులు దందాకు పాల్పడుతున్నారు. బుకింగ్ కౌంటర్ వద్ద టోకెన్లు తీసుకుని అమ్ముకుంటున్నారు .. 8లో▸



ఉత్సాహంగా..ఉల్లాసంగా

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 16 నవోద య విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. .. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,236
అవుట్ ఫ్లో	:10,696

న్యూస్‌రీల్

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందనాయక్

దొర్నిపాడు: పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందనాయక్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా దొర్నిపాడులో పాదువ మహిళలు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రధాన కూడళ్లు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్తను తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అక్టోబరు 2వ తేదీన ప్లాస్టిక్‌ను నిషేధించేలా గ్రామ సభల్లో తీర్మానాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సర్పంచి సానికా దేవమణి, ఎంఈఓ రామచంద్రయ్య, వెలుగు ఏపీఎం బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జున పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(రూరల్): పర్యాటక రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి సి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 విభాగాలకు సంబంధించి 41 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు చేయాలనుకునే వారు ఏపీ టూరిజం వెబ్‌సైట్ https:// aptourism.gov.in నుంచి పూర్తి సమాచారంతో పాటు దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ లోపు ఏపీ టూరిజం అథారిటీ, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆటో నగర్, విజయవాడ చిరునామాకు పంపాలని సూచించారు. ఈ నెల27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 7995087089, 8297098022ను సంప్రదించాలన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

శిరివెళ్ల: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి డ్వామా పీడీతో పాటు డీఈఓ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించి భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, హెచ్ఎం బాలనాగిరెడ్డి, సర్పంచు మరియమ్మ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో స్టేట్ కోటా కింద మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల్లో 79 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ మంగళవారం తెలిపారు. మొదటి విడత అడ్మిషన్లు ఈ నెల 19వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు.

ప్రభుత్వ కళాశాలతో పేద విద్యార్థులకు న్యాయం



నాన్న పశుసంవర్ధక శాఖలో ఏడీగా పనిచేస్తారు. నేను టెన్త్‌లో 481/500 (సీబీఎస్ఈ) మార్కులు సాధించాను. నీట్‌లో ఎలాగైనా సీటు సాధించాలన్న లక్ష్యంతో ఇంటర్‌లో చేరాను. ప్రైవేటు మెడికల్ కాలేజీలతో పోలిస్తే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఎంతో బాగుంటాయి. ఇక్కడ నిపుణులైన ప్రొఫెసర్లతో పాటు నర్సింగ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బంది ఉంటారు. ప్రైవేటు మెడికల్ కాలేజీ మాదిరిగా అద్దె రోగులు ఉండరు. ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు కాబట్టి అక్కడ ప్రాక్టికల్‌గా బాగా నేర్చుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లను ప్రభుత్వం తెచ్చి ఉంటే బాగుండేది. దీనివల్ల మాలాంటి వారికి ఎంతో మేలు జరిగేది. మెరిట్ సాధించే పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం జరిగేది. ఆర్థికంగా వెనుకబడిన వారు ప్రైవేటులో ఫీజు చెల్లించలేరు. అక్కడ డబ్బులు చెల్లించలేక మెరిట్ సాధించినా సీటు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

–ఎం. అఖిల్, కర్నూలు



ఫీజు భారంతో ప్రైవేటు కాలేజీల్లో చేరలేము



నాన్న గోల్డ్ స్మిత్. నేను టెన్త్‌లో 580 మార్కులు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 431 మార్కులు సాధించాను. సెకండియర్, నీట్‌లో మంచి మార్కులు సాధించి ఎలాగైనా మెడిసిన్ సీటు సాధించాలని ఉంది. ఇందుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లు పెరిగితే ఎంతో మేలు కలుగుతుంది. ఈ ఏడాదే ప్రభుత్వం ఆ పని చేసి ఉంటే బాగుండేది. కానీ ఈ యేడాది కూడా ఎన్‌ఎంసీ ఇచ్చిన సీట్లు కూడా వెళ్లిపోయాయని అంటున్నారు. ప్రైవేటు మెడికల్ కాలేజీలో సౌకర్యాలు బాగుండవు. అందులో డాక్టర్లతో పాటు రోగులు కూడా ఉండరు. దీనివల్ల అక్కడ నేర్చుకునేందుకు అవకాశం తక్కువ. పైగా ఫీజులు ఎక్కువ. కానీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వీటికి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ఎంతో నేర్చుకోవచ్చు. రోగులు ఎక్కువగా వస్తారు కాబట్టి ప్రాక్టికల్‌గా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో తక్కువ సీట్లు ఉండటం వల్ల మాలాంటి మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.

–సి. రూపశ్రీ, కర్నూలు



మల్యాల ఎత్తిపోతల నుంచి నీటి విడుదల దృశ్యం

నీరున్నా.. కన్నీరే!

ఆరు జిల్లాలు.. 7.04 లక్షల ఎకరాల ఆయకట్టు.. 33 లక్షల మందికి తాగునీరు.. 40 టీఎంసీలు ఎత్తిపోసేందుకు 120 రోజులు మాత్రమే గడువు. ఇప్పటికే సగం రోజులు గడిచినా కేవలం 4.5 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. దీన్ని బట్టి తక్కిన సగం రోజుల్లో ఇంతకు రెట్టింపు ఎత్తిపోసినా 15 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని పారించలేని పరిస్థితి. కృష్ణా నదికి భారీగా వరద వచ్చి రెన్నెల్లుగా కళ్ల ముందు నీరు పారుతున్నా, శ్రీశైలం రిజర్వాయర్ నిండు కుండను తలపిస్తున్నా ప్రభుత్వం మాత్రం 'హంద్రీ–నీవా సుజల స్రవంతి'కి నీటిని విడుదల చేయకుండా 'సీమ'కు తీరని అన్యాయం చేస్తోంది. ఈ కారణంగా గతేడాది వర్షాభావంతో ఇబ్బందులు పడిన రైతుకు, ఈసారి కళ్లెదుట నీరున్నా కన్నీరే మిగులుతోంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

హంద్రీ–నీవా ద్వారా 1,350 క్యూసెక్కుల నీరే విడుదల

- ప్రధాన కాలువ సామర్థ్యం 3,800 క్యూసెక్కులు
- 'సీమ'లో హంద్రీ–నీవాపై ఆధారపడి 7.04లక్షల ఎకరాల ఆయకట్టు
- 120 రోజుల్లో 40 టీఎంసీలు ఎత్తిపోసేలా కాలువ నిర్మాణం
- గత 48 రోజుల్లో 4.5 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోత
- ఈ లెక్కన 120 రోజుల్లో 12 టీఎంసీలకే పరిమితం
- గత ప్రభుత్వంలో 40 టీఎంసీలకుపైగా ఎత్తిపోసిన వైనం

ప్రభుత్వ వైఖరి చూస్తుంటే 'సీమ' రైతుల ప్రయోజనాలను, అవసరాలను పూర్తిగా విస్మరించినట్లు స్పష్టమవుతోంది. శ్రీశైలంలోకి వరద ప్రవాహం మొదలై రెన్నెల్లవుతోంది. అయితే ఇప్పటి వరకూ హంద్రీ–నీవా ద్వారా కేవలం 4.5 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసింది. ఫ్లడ్‌డేస్ (వరద రోజులు) ఇప్పటికే సగం అయిపోయాయి. ఇప్పటి నుంచి నెలకు 5 టీఎంసీలు ఎత్తిపోసినా, మరో రెన్నెల్లలో 10 టీఎంసీలు, ఇప్పటి వరకు ఇచ్చిన 4.5 టీఎంసీలు కలిపి 14.5 టీఎంసీలకు కంటే ఎక్కువ పారించలేని పరిస్థితి కనిపిస్తోంది. 'హంద్రీ–నీవా'కు నీటిని ఎత్తిపోసేందుకు నంద్యాల జిల్లా మల్యాల వద్ద 12 పంప్‌లు నిర్మించారు. ఒక్కో పంప్ సామర్థ్యం 335 క్యూసెక్కులు. 12 టీఎంసీలు ఆన్ చేస్తే 4,020 క్యూసెక్కులు విడుదల చేయొచ్చు. అయితే కాలువ సామర్థ్యం 3,800 క్యూసెక్కులు. వీటన్నిటిని నీటిని ఫ్లడ్ డేస్‌లో ఎత్తిపోస్తే 120 రోజుల్లో 40 టీఎంసీల వరకూ పారించే వీలుంది. అయితే ఈ ఏడాది నీటి విడుదలలో ప్రభుత్వం జాప్యం చేసింది. ప్రాజెక్టులో 800 అడుగుల నుంచే హంద్రీ–నీవాకు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంది. 854 అడుగుల వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీటిని విడుదల చేస్తారు. అయితే ఈ ఏడాది 870 అడుగులు దాటినా హంద్రీ–నీవాకు నీటిని విడుదల చేయకపోవడం గమనార్హం.

టీడీపీ నేత స్వార్థం

కర్నూలు–గుంటూరు రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దక్కించుకోవడంతో వంతెన నిర్మించేందుకు హంద్రీ–నీవా ప్రధాన కాలువను పూడ్చేశాడు. దీంతో నీటిని విడుదల చేయలేకపోయారు. దీనిపై 'పుట్టాపాపం.. సీమకు శాపం' శీర్షికన 'సాక్షి' గత జూలై 31న కథనాన్ని ప్రచురించింది. దీంతో 1వ తేదీ కాలువలో పూడిక తొలగించి నీటిని విడుదల చేశారు.

13.410 టీఎంసీలతో సరిపెట్టుకోవాల్సిందే..

ప్రస్తుతం కాలువలో 4 పంప్‌ల ద్వారా 1,350 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది 18 రోజులు ఆలస్యంగా నీటిని విడుదల చేశారు. అంటే 120 రోజుల్లో ఇప్పటికే 51రోజులు ముగిశాయి. తక్కిన 69 రోజుల్లో ఇప్పుడున్న నాలుగు పంప్‌లకు అదనంగా మరో 2 పంప్‌లు ఆన్ చేసినా రోజుకు 2,010 క్యూసెక్కుల చొప్పున 1,38,690 క్యూసెక్కులు మాత్రమే ఎత్తిపోయొచ్చు. 11వేల క్యూసెక్కులు ఒక టీఎంసీ. ఈ లెక్కన 12.608 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేయొచ్చు. ఇందులో కూడా నీటివృథాను తీసేస్తే 10 టీఎంసీలు మాత్రమే దక్కనుంది. ఈ లెక్కన సీజన్ మొత్తం 13.410 టీఎంసీలు మాత్రమే 'సీమ'కు అందే అవకాశం ఉంది. లేదా ఇప్పుడున్న నాలుగు పంప్‌లతోనే 1,350 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తే మరో 6–7 టీఎంసీలు మాత్రమే అందనుండటం గమనార్హం.

గత ప్రభుత్వంలో వీలైనంత ఎక్కువ నీరు ఇచ్చిన వైఎస్ జగన్

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత 2014–15లో 16.83 టీఎంసీలు ఇచ్చారు. 2015–16లో 7.80 టీఎంసీలకే పరిమితమైంది. ఆ తర్వాత మూడేళ్ల 30 టీఎంసీలకు పైగా ఇచ్చారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2019–20లో అత్యధికంగా 47.34 టీఎంసీలు, 2020–21లో 45.65 టీఎంసీలు ఇచ్చారు. 2023–24లో వర్షాభావంతో శ్రీశైలంలో గేట్లు కూడా తెరవలేదు. అయినప్పటికీ 32.29 టీఎంసీలు ఇచ్చారు. దీన్నిబట్టి 'సీమ'పై జగన్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది. ఈ ఏడాది జలగణన లెక్కల ప్రకారం శ్రీశైలానికి 525.95 టీఎంసీలు వచ్చింది. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు మాత్రమే. తక్కిన నీటిని పూర్తిగా కిందకు విడుదల చేశారు. ఈ క్రమంలో వీలైనంత ఎక్కువ నీటిని రిజర్వాయర్‌లు, చెరువులకు తరలించి నింపాలి. తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయి. సాగుకు ఉపయోగపడతాయి. భవిష్యత్‌లో నీటి కష్టాలు, వర్షాభావం ఉన్నా నిల్వ చేసిన నీరు రైతులకు ఉపయోగపడుతుంది. కానీ ప్రభుత్వం, హంద్రీ–నీవా అధికారులు ఆదిశగా ఆలోచించకపోవడం సీమకు శాపంగా మారింది.

సీమలో ప్రతిపాదిత ఆయకట్టు వివరాలు

జిల్లా	ఆయకట్టు (ఎకరాల్లో)
కర్నూలు	79,300
అనంతపురం	2,09,129
శ్రీ సత్యసాయి	2,02,183
అన్నమయ్య	1,55,350
చిత్తూరు	52,250
తిరుపతి	6,400
మొత్తం	7,04,612



6 జిల్లాల్లో 8 రిజర్వాయర్లు.. వందల చెరువులకు తీవ్ర నష్టం

- 'సీమ'లో నంద్యాల జిల్లా మినహా తక్కిన ఆరు జిల్లాలు హంద్రీ–నీవా నీటిపైనే ఆధారపడ్డాయి.
- మల్యాల నుంచి అడవిపల్లి రిజర్వాయర్ వరకు 565 కిలోమీటర్ల ప్రధాన కాలువ ఉంది. ఇందులో 8 రిజర్వాయర్‌లు నిర్మించారు. వీటిని నింపడానికి 9.089 టీఎంసీలు అవసరం.
- అయితే హంద్రీ–నీవాకు నీటిని విడుదల చేయకపోవడానికి కారణం 'నీటి అవసరం లేదు' అని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోనే తక్కువగా నీటిని విడుదల చేస్తున్నారు.
- 565 కిలోమీటర్లలో ఈనెల 2న సోమవారం శ్రీ సత్యసాయి జిల్లాలోకి నీరు చేరింది.
- ఇప్పటి వరకు పత్తికొండ, క్రిష్ణగిరి, జీడిపల్లి రిజర్వాయర్లు మాత్రమే నిండాయి.
- గొల్లపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 1.913 టీఎంసీలు. ప్రస్తుతం గతేడాది నీరు 0.537 మాత్రమే ఉంది.
- మారాల సామర్థ్యం 0.483 టీఎంసీలు. ప్రస్తుతం చుక్కనీరు లేదు.
- చెర్లోపల్లి సామర్థ్యం 1.608 టీఎంసీలు. గతేడాది నీరు 0.341 టీఎంసీలు మాత్రమే ఉంది. శ్రీనివాసపురం, అడవిపల్లిలకు నీరు చేరాలి.
- ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం 1085 క్యూసెక్కులు మాత్రమే అందుతోంది.
- దీన్నిబట్టి చూస్తే రిజర్వాయర్లు నిండేందుకే ఈ ప్రవాహం సరిపోదు. ఇక వీటి కింద వందలాది చెరువులు, ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి.

ఎవ్వరూ అడగటం లేదు..

నీటి డిమాండ్ లేదు. ఎవ్వరూ అడగడం లేదు. కాలువ సామర్థ్యం 3,800 క్యూసెక్కులు ఉన్నా 2వేలు మాత్రమే ప్రవహిస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. అందుకే విడుదల చేయలేదు. అనంతపురం జిల్లాలో చెరువులన్నీ నెర్రెలు చీలాయి. వర్షాలు లేక ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గింది. కర్నూలు, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలదీ అదే పరిస్థితి.

– రాజగోపాల్, హంద్రీ–నీవా కర్నూలు సర్కిల్ ఎస్ఈ

భ్రామరీకి లక్ష కుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి మంగళవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను శాస్త్రోక్తంగా చేపట్టారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి 22 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా పాల్గొన్నారు. మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యత ఉందని, కుంకుమతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొన్నారు. లక్ష కుంకుమార్చన సేవను జరిపించుకోవడం వలన కష్టాలు తొలగిపోతాయన్నారు. సర్వశుభాలు కలుగుతాయని, అభీష్టాలు సిద్ధిస్తాయని, సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. సంసారం వృద్ధిలోకి వస్తుందని, సంతాన సౌఖ్యం కలుగుతుందని, పూర్వజన్మ దోషాలు తొలగిపోతాయని చెప్పబడుతుంది.



కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న పండితులు

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాఠశాల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల పట్టణంలోని కేఎస్ఎం పాఠశాల, ముల్లాన్‌పేట, నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు. జిల్లాలోని 29 మండలాల్లో 142 ప్రాథమిక కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): నులిపురుగుల నివారణకు ప్రతి విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు విద్యార్థులందరీ చేత నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. నులిపురుగుల వల్ల జీర్ణాశయంలో కలిగే అనారోగ్య సమస్యలు, ముఖ్యంగా ఆడపిల్లల్లో వచ్చే రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి గురువారం పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా మింగించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి కాంతారావు నాయక్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి, ఎంఈఓ బ్రహ్మం, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి రమ్యకృష్ణ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ రాజకుమారి

పరిమళిస్తున్న మల్లన్న విభూది

- గోశాలలోని గోమయంతో విభూది తయారీ
- రుద్రహోమం, చండీహోమ భస్మం కూడా వినియోగం
- శ్రీశైల దేవస్థానానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- విభూది కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న భక్తులు



శ్రీశైలంటెంపుల్: జన్మజన్మలుగా పేరుకుపోయిన పాపాన్ని సైతం విభూది పూర్తిగా నశింపజేస్తుందట.. నిష్ఫగల వారికి భస్మం ప్రాణదానం చేసే సంజీవనిలా పనిచేస్తుందట.. అరిష్టాలన్నింటిని తొలగిస్తుందట.. సమస్త శుభాలను, సర్వసంపదలను చేకూరుస్తుందట.. తేజస్సును కలిగిస్తుందట. మోక్షాన్ని అనుగ్రహిస్తుందట.. అటువంటి సద్గుణాలను ప్రసాదించే విభూదిని ధరించడం శుభప్రదమని పురాణాలు చెబుతున్నాయి. అంతటి సుగుణాలు, పవిత్రత కలిగిన విభూదిని శ్రీశైల దేవస్థానం తయారు చేస్తోంది. విభూది విక్రయాల ద్వారా దేవస్థానానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. శ్రీశైల మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులు స్వామి విభూదిని పరమ పవిత్రంగా భావిస్తారు. దేవస్థానం గోశాలలో గోమయంతో నిష్ఠగా తయారు చేయించి విక్రయిస్తుంది. విభూది విక్రయాల ద్వారా దేవస్థానానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. క్షేత్రానికి వచ్చే భక్తులకు దేవస్థానం స్వచ్ఛమైన గోమయంతో తయారు చేసిన దివ్యపరిమళ విభూదిని అందుబాటులో ఉంచింది. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలలో విభూదిని తయారు చేస్తోంది. తయారీలో శాస్త్రోక్తంగా, ప్రమాణాలు పాటిస్తున్నారు.

విభూది తయారీ ఇలా..

దేవస్థానం గోశాల నుంచి లభించే గోమయం(ఆవుపేడ)ను పిడకలుగా చేసి ఎండలో ఆరబెడతారు. ఎండిన వాటిని కాల్చి తద్వారా వచ్చిన బూడిద (భస్మం)ను వడపోసి ప్రత్యేక యంత్రంలో వేస్తారు. వచ్చిన మిశ్రమాన్ని కేకులుగా తయారు చేసి మళ్లీ కాల్చుతారు. తద్వారా వచ్చే భస్మాన్ని విడతల వారీగా వడపోసి చివరికి విభూదిని తయారు చేస్తారు. అలాగే ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో రుద్రయాగం, చండీయాగంలోని భస్మాన్ని కూడా విభూది తయారులో వినియోగిస్తుండడంతో పవిత్రత చేకూరుతుంది. విభూది తయారు చేయడానికి సుమారు 17 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



విభూది ప్యాకెట్లను తయారు చేస్తున్న దృశ్యం

దేవస్థానానికి ఆదాయం..

దివ్య పరిమళ విభూదిని ప్యాకెట్లు, డబ్బాల్లో దేవస్థానం విక్రయిస్తుంది. 10 గ్రాముల విభూది డబ్బా రూ.10, 50 గ్రాముల డబ్బా రూ.20, 75 గ్రాముల డబ్బా రూ.30, 100గ్రాముల డబ్బా రూ.40, 50గ్రాముల విభూది ఉండా ర ూ.10, విభూది ప్యాకెట్లను రూ.10గా విక్రయిస్తున్నారు. కిలో విభూది ధర రూ.300గా నిర్ణయించారు. దీంతో ఆలయానికి విభూది విక్రయాల ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం లభిస్తుంది.



దేవస్థానం ఆధ్వర్యంలో విభూది విక్రయకేంద్రం

విభూదికి ఎంతో విశిష్టత



మన శాస్త్రాలలో విభూది మహిమ ఎంతో విశేషంగా చెప్పబడింది. అందుకే ఆలయ సంప్రదాయ పరిరక్షణలో భాగంగాను, విభూదిధారణపై భక్తులకు అవగాహన కలిగేందుకు, స్వచ్ఛమైన విభూతిని అందజేసేందుకై దేవస్థానం విభూది తయారీని చేపట్టింది. అలాగే ఆలయానికి వచ్చే భక్తులకు విభూదిధారణ చేయించే సంప్రదాయాన్ని కూడా ఇటీవల పునఃప్రారంభించాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రంలో మంగళవారం గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహా మంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి మొదలైన గిరి ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ గుడి, నందిమండపం, గంగాసదనం, బయలువీరభద్రస్వామి ఆలయం, రింగ్ రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్పకొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన అధికారులు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు, వేద పండితులు

క్లుప్తంగా

పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పారామెడికల్ కోర్సులకు మూడో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్లకు అడ్మిషన్లను కౌన్సిలింగ్ కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ మాట్లాడుతూ పారామెడికల్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు సంబంధించి మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేశామన్నారు. దాదాపు అన్ని సీట్లు పూర్తయ్యాయని తెలిపారు. దీంతో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయ్యిందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లను వచ్చే నెలలో జరిగే రెండో విడత కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. కౌన్సిలింగ్ కమిటీలో వైస్ ప్రిన్సిపాల్, కన్వీనర్ డాక్టర్ పి. హరిచరణ్, డాక్టర్ టి. సాయి సుధీర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. అనిల్‌కుమార్ రెడ్డి, ఏఓ ఎస్. లక్ష్మీప్రసన్న ఉన్నారు.

21న క్రీడల్లో ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 21 వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎన్. గిడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, కరాటే క్రీడల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికల ఎంపికకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సమాచారం కోసం 95730 98008 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బుధవారం ఉదయం 10 గంటలకు టేబుల్ టెన్నిస్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ..


పృథ్వీరాజ్ (ఫైల్)

కర్నూలు : స్థానిక కొత్తపేటకు చెందిన బాసిపోగు పృథ్వీరాజ్ (24) కొత్తబస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఆర్‌కే ఇన్ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను డిగ్రీ వరకు చదువుకున్నాడు. వ్యాపారం చేస్తానని తల్లిదండ్రులకు చెప్పి స్నేహితుల వద్ద సుమారు రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. అయితే, వ్యాపారం ప్రారంభించకపోగా అప్పు చేసిన డబ్బులను బెట్టింగ్‌లకు పెట్టి నష్టపోయాడు. మరోవైపు రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్థాపానికి గురై సోమవారం రాత్రి బస్టాండ్ వద్ద ఉన్న ఆర్‌కే ఇన్ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని లోయర్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నాలు గో పట్టణ ఎస్ఐ సమీర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్, బేతంచెర్ల, నంద్యాల, అవుకు ఐటీఐ కాలేజీల్లో సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో 28 వ తేదీ, ప్రైవేటు ఐటీఐల్లో 30 వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇసుక బుకింగ్‌లో టోకెన్ల దందా

- పర్మిట్ల జారీకి అధికారుల టోకెన్ల కేటాయింపు
- కొందరు స్థానికులు అమ్ముకుంటున్న వైనం
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిపై భారం


ఇసుక బుకింగ్ కేంద్రం దగ్గర టోకెన్ల విషయంపై వాగ్వాదం పడుతున్న డ్రైవర్లు


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: కొత్త సినిమా విడుదల సందర్భంగా థియేటర్ల వద్ద బ్లాక్ టికెట్ల దందా ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. అదే సీనూ ప్రతి రోజూ మండల కేంద్రం సి.బెళగల్లోని గ్రామ సచివాలయం – 2లో కనిపిస్తోంది. పర్మిట్ల జారీకి అధికారులు టోకెన్ల విధానం తేవడంతో ఇదే అదునుగా కొందరు స్థానికులు బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని ఈర్లదిన్నె, కొత్తకోట, కె. సింగవరం ఇసుక రీచ్‌లకు సంబంధించిన పర్మిట్లను కర్నూలు మైనింగ్ ఆఫీస్‌లో, సి.బెళగల్ సచివాలయం – 2లో జారీ చేస్తారు. ఈ రెండు చోట్ల దాదాపు 200 ట్రాక్టర్లు, టిప్పర్లకు పర్మిట్లు ఇస్తున్నారు. గతంలో సి.బెళగల్ సచివాలయం – 2లో ఇసుక బుకింగ్ కోసం వచ్చిన వారికి వచ్చినట్టుగా మొదట అధికారులు పర్మిట్లను జారీ చేసేవారు. అయితే బుకింగ్ కేంద్రం వద్ద రద్దీని నియంత్రించాలని మండల తహసీల్దార్, పోలీసులు గత వారం నుంచి టోకెన్లను జారీ చేయాలని బుకింగ్ అధికారులను ఆదేశించారు. ఇదే అదునుగా భావించిన సి.బెళగల్‌కు చెందిన కొంతమందితో పాటు ప్రైవేట్ కారు డ్రైవర్లు దళారులు మారి టోకెన్ల అమ్ముకుంటున్నారు. ఇసుక అవసరం ఉన్న ప్రజలు, వాహనదారులు దూర ప్రాంతాల నుంచి బుకింగ్ కేంద్రాలకు చేరుకుంటుండగా, అంతలోపు స్థానికంగానే ఉన్న దళారులు పరిమిత సంఖ్యలో ఉండే టోకెన్లను ఒక్కొక్కరు రెండు మూడు పొంది బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. విషయం తెలిసినా అధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. మంగళవారం ఈ విషయంపై వాహనదారులు వాగ్వాదం పడటంతో సంఘటనా స్థలానికి ఎస్ఐ తిమ్మారెడ్డి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

రూ.500 కొట్టు... టోకెన్ పట్టు..

కొందరు స్థానికులు టోకెన్ల దళారుల అవతారం ఎత్తారు. ఒక టోకెన్ రూ.500 నుంచి రూ.800 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. అనధికారికంగా టోకెన్ ధర రూ.500గా ఇసుక బుకింగ్ కేంద్రం దగ్గర ప్రచారం జరుగుతున్నా, ఫిర్యాదులు వస్తున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. లబ్ధిదారులకు ఇసుక బుకింగ్‌తో పాటు, రవాణా చార్జీకి ఇప్పుడు అదనంగా టోకెన్ల ధరలు చెల్లించాల్సి వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. గత వారం మొత్తం ఈ బుకింగ్ కేంద్రం వద్ద టోకెన్లు రీ సైక్లింగ్ జరిగినట్లు తెలుస్తోంది. టోకెన్ పద్ధతిని అధికారులు సొమ్ము చేసుకోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పది గంటలకే టోకెన్లు లేవు



మేము ఇసుక బుక్ చేసుకునేందుకు ఉదయం మా ఊరి నుంచి బయలుదేరి వచ్చేసరికి పది గంటలు అయ్యింది. అప్పటికే బుకింగ్ కేంద్రం దగ్గర టోకెన్లను లేవన్నారు. నిజంగా ఇసుక కోసం వచ్చే వారు టోకెన్లు పొందాలంటే చాలా ఇబ్బందులు పడాల్సిందే. ఇసుక అవసరం లేని చాలా మంది దళారులు బుకింగ్ కేంద్రం వద్ద ఉంటున్నారు.

– దివాకర్, మల్యాల గ్రామం, డోన్ మండలం

ఆన్‌లైన్ బుకింగ్‌ను అమలు చేయాలి



మేము డోన్ నుంచి బుకింగ్ కేంద్రానికి వస్తే టోకెన్లు అయిపోయ్యాయి అంటున్నారు. రవాణా, బుకింగ్ చార్జీలకు తోడు టోకెన్లను సైతం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఇక్కడ ఉంది. ఒక్క ట్రిప్పు ఇసుకను పొందాలంటే మొత్తం ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్ అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ఇప్ప ఇప్పటి వరకు కార్యాచరణ కాలేదు. వెంటనే అమలు చేస్తే బాగుంటుంది.

– శేఖర్, డోన్

చర్యలు తీసుకుంటాం



మండలంలో ఇసుక బుకింగ్, పంపిణీ ప్రక్రియలు సజావుగా సాగుతున్నాయి. క్యూలైన్లలో ఇబ్బందులు, ఘర్షణలు పడుతున్నారని టోకెన్లు జారీ చేపట్టాం. అయితే దళారుల ప్రమేయం, టోకెన్ల అమ్మకాల విషయం మా దృష్టికి రాలేదు. ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

– విజయశ్రీ, సి.బెళగల్ తహసీల్దార్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతుడు గుండు సిద్దయ్య(ఫైల్)

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామానికి చెందిన గుండు సిద్దయ్య (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం మండలంలోని వాడాల గ్రామ సమీపంలోని క్రొంపోలు వాగులో ఆయన మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 14న మృతుడు సిద్దయ్య తన మిత్రులతో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ తెలియకపోవడంతో కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు ఈ నెల 16న స్థానిక పోలీసు స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. మంగళవారం వాడాల గ్రామ సమీపంలోని క్రొంపోలు వాగు వద్ద ఆయన మృతదేహం కనిపించడంతో ఎస్ఐ సురేష్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య శివమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా సిద్దయ్యను మిత్రులే హత్య చేసి కేసీ కెనాల్‌లో పడేశారా ?లేక మద్యం మత్తులో అతనే నీటిలో పడి చనిపోయాడా అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

నిందితుడికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ నిందితుడికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి మంగళవారం జైలు శిక్ష విధించారు. స్థానిక దేవనగర్‌కు చెందిన అస్లాం సంజీవనగర్‌లో మద్యం సేవించి బైక్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ట్రాఫిక్ పోలీసులు గుర్తించి బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్ష చేసి పట్టుకున్నారు. తర్వాత కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి 10 రోజులు జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మిరపనారుకు చీరలతో రక్ష



సి. బెళగల్ మండలంలోని సంగాల గ్రామంలో కొంత మంది రైతులు మిరప నారును సాగు చేస్తున్నారు. పశువులు, కీటకాల నుంచి నారును రక్షించుకునేందుకు మహిళల పాత చీలు, పురుషుల దొవతీలతో తెరను ఏర్పాటు చేసుకున్నారు. మిరప రైతుల చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

– సి.బెళగల్

ఒకే కాన్పు.. ముగ్గురు శిశువులు


ఆరోగ్యంగా ఉన్న ముగ్గురు శిశువులు


శిశువులకు జన్మనిచ్చిన తల్లి స్వప్న

ఆళ్లగడ్డ: ఒకే కాన్పులో ఓ మహిళ ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారు. పట్టణంలోని పాతమసీదు వీధికి చెందిన చెందిన ఆవుల స్వప్న, ప్రకాశ్‌లకు 8 ఏళ్ల క్రితం వివాహం అయింది. అయితే, పిల్లలు కాకపోవడంతో వివిధ ఆసుపత్రుల్లో చూపించుకున్నారు. కొన్ని నెలల క్రితం స్వప్న గర్భ దాల్చడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్కానింగ్ చేయించగా ముగ్గురు శిశువులు ఉన్నట్లు తేలింది. అప్పటి నుంచి వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్య బృందం ప్రత్యేక చొరవ తీసుకుని సాధారణ కాన్పు చేశారు. ప్రసవంలో ఇద్దరు మగ, ఒక ఆడ శిశువు జన్మించారు. శిశువులతో పాటు తల్లీ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు

రైలులో వ్యక్తి మృతి


మృతి చెందిన రామసుబ్బారెడ్డి

డోన్ రూరల్: వైఎస్సార్ కడప జిల్లా అక్కాయపల్లి గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి(76) అనే వృద్ధుడు రైలులో అకస్మాత్తుగా మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మృతుడు మంగళవారం ఔరంగబాద్ -గుంటూరు ఎక్స్‌ప్రెస్ 17254 నంబర్ గల రైలులో ప్రయాణిస్తున్నాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఎస్7 బోగీలోని బాత్ రూంలోకి వెళ్లి అక్కడ స్పృహ తప్పి పడిపోయాడు. తోటి ప్రయాణికులు గమనించి డోన్ వద్ద డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ముకేష్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే జీఆర్‌పీ పోలీసులు, డాక్టర్లు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వద్ద ఉన్న సెల్ ఫోన్‌లో కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ ఉండటంతో వెంటనే ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 10 రోజుల క్రితమే రామసుబ్బారెడ్డి ఇంటి నుంచి బయటికి వచ్చినట్లు కుమారుడు రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కాగా మృతదేహాన్ని ప్రస్తుతం డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచామని, కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతామని రైల్వే పోలీసులు వెల్లడించారు.

నాలుగు వాహనాలు సీజ్

కర్నూలు న్యూసిటీ : అక్రమంగా ఖనిజ రవాణా చేస్తున్న నాలుగు వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు మైనింగ్‌శాఖ డీడీ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాపరాయి లోడ్‌తో వెళ్తున్న లారీని పాణ్యం వద్ద, క్వార్ట్జ్‌రైట్ పౌడర్ లారీ, డోలమైట్ లారీ, ఇసుక ట్రాక్టర్‌ను నన్నూరు టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆ వాహనాలను సమీప పోలీస్ స్టేషన్ల కు తరలించికేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ బాలు నాయక్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

అభివృద్ధి పనులకు అధికారులే అడ్డంకి

- ఎమ్మెల్యే అంటే ఆలూరు తహసీల్దార్‌కు లెక్కలేదు
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆగ్రహం


ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో అభివృద్ధిపనులకు అధికారులే అడ్డుతగులుతున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మండిపడ్డారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఆలూరు పట్టణంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీలో వైఎస్సార్‌సీపీ హయాంలో విడుదలైన ఎంపీపీ నిధులు రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఇందుకోసం మండలంలోని హత్తిబెళగల్ గ్రామ పరిధిలో ఉన్న కొండ నుంచి 10 ట్రాక్టర్ల ఎర్రమట్టి తెచ్చుకునేందుకు వెళ్లగా మైనింగ్ శాఖ అనుమతి కావాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ వీఆర్వోను పంపించి అడ్డుకున్నారన్నారు. మట్టి లేకుంటే పనులు ఆగిపోతాయి పర్మిషన్ కావాలంటే రేపటిలోగా చలానా చెల్లిస్తామని చెప్పినా ఆయన వినలేదన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అంటే లెక్కలేదన్నట్లు తహసీల్దార్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మట్టి విషయమై తహసీల్దార్ తర్వాత ఎంపీడీఓ అల్లబకాష్‌కు ఫోన్ చేసినా సరైన స్పందన లేదన్నారు. హత్తిబెళగల్, అరికెర గ్రామాల నుంచి ప్రతి రోజు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని సరిహద్దులోని కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నా తహసీల్దార్‌కు కళ్లు కనిపించడం లేదన్నారు. మామూళ్ల మత్తులో పడి అక్రమంగా ఎర్రమట్టి అమ్ముకుంటున్న వారిని వదిలిపెట్టి అభివృద్ధి పనులు చేపట్టే తమను ఇబ్బంది కలిగిస్తున్నారని ఆరోపించారు. స్థానిక అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

అంబేడ్కర్ గురుకులంలో 19 మందికి మెడిసిన్ సీట్లు


డా.ఐ శ్రీదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీకి చెందిన 19 మంది విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించారని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ఐ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయ కర్త డా.ఐ శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వీరందరికి రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలల్లో సీట్లు అలాట్ అయ్యాయన్నారు. అలాగే ఇంజినీరింగ్‌కు సంబంధించి ఐఐటీకి 08, ఎన్ఐటీకి 25, సీయూ సీఈటీకి 07, ఐఐఐటీకి 01 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రంలోని అడవి టిక్కలపాడు, ఇడుపుగల్లు అకాడమీలతో పోల్చుకుంటే చిన్నటేకూరు విద్యార్థులు అధిక సంఖ్యలో మెడిసిన్ సీట్లు సాధించారన్నారు. అలాగే ఐఐటీ, ఎన్ఐటీలో కూడా తమ అకాడమీ విద్యార్థులే టాప్‌లో ఉన్నారన్నారు. ఈ స్థాయిలో సీట్లు రావడానికి అధ్యాపకుల కృషి ఎంతో ఉందన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులు వీరే

పోలా మనోజ్‌కుమార్ కర్నూలు మెడికల్ కళాశాల, బుద్ధగారి అబ్రహామ్, పగడాల పాల్ అరుణ్‌కుమార్ అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల, పులుగు దినేష్, వడితే త్రినాథ్‌నాయక్ ,కాకినాడ రంగరాయ, మహమ్మద్ రషీద్ విజయవాడ ప్రభుత్వ సిద్దార్థ, మాసపోగు అద్విత్ సంగీతరావు, మల్లెపోగు అద్భుత కుమార్, మంచాల సునీల్‌కుమార్ కడప ప్రభుత్వ మెడికల్ కాలేజి, మాసపోగు శ్రీధర్ నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల, నేనావత్ మల్లేష్‌నాయక్ రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాల, సాకే కిషోర్ నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజ్, పిడుగు రంజిత్‌కుమార్, బానోత్ మహేంద్రనాయక్,కుప్పం, పసుపులేటి రాజ, కొమ్మతోటి రాహుల్,విజయనగరం, పి చరణ్‌తేజ, ఎం ఉమేష్‌కుమార్,కర్నూలు విశ్వభారతి, వాకిటి సుభాష్ తిరుపతి శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సీటు సాధించినట్లు డీసీఓ వెల్లడించారు.

పశు బీమాకు అరకొర బడ్జెట్

- పథకం అమలును నిలిపేసిన పశుసంవర్ధక శాఖ

కర్నూలు(అగ్రికల్చర్): పశుబీమా పథకం అమలు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 2023 మే 20న జారీ చేసిన పశు బీమా పథకాన్ని (లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్) కూటమి ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి పునరుద్ధరించినప్పటికీ బడ్జెట్‌ను నామమాత్రంగా విడుదల చేసింది. ఈ మొత్తం నెల రోజుల్లోపే ఖర్చయిపోవడంతో పథకం నీరుగారుతోంది. కర్నూలు జిల్లాలో బీమాకు అర్హత ఉన్న తెల్ల, నల్ల జాతి పశువులు 2,89,299, నంద్యాల జిల్లాలో 3,11,737 ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గుర్తించింది. ప్రభుత్వ వాటా ప్రీమియం చెల్లించేందుకు కర్నూలు జిల్లాకు రూ.11 లక్షలు, నంద్యాల జిల్లాకు 12 లక్షలు మంజూరు చేసింది. జాతి పశువులకు రూ.30వేలు, నాటు పశువులకు రూ.15వేలు, సన్న జీవాలకు రూ.6వేలు బీమా చేస్తారు. తాజాగా మంజూరు చేసిన బడ్జెట్‌తో ఉమ్మడి జిల్లాలో 8వేల పెద్ద పశువులకు బీమా చేశారు. రైతుల నుంచి బీమా పట్ల ఆదరణ ఉండటంతో నెలలోపే ఆ మొత్తాన్ని వినియోగించారు. ప్రస్తుతం మిగిలిన పశువులకు బీమా ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే పశుబీమా పథకం అమలును నిలిపివేయాలని పశుసంవర్ధక శాఖ కూడా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.


జానపద నృత్యం చేస్తున్న బాలికలు

ఉత్సాహంగా..ఉల్లాసంగా

- నవోదయలో అట్టహాసంగా ప్రారంభమైన క్లస్టర్ స్థాయి కళా ఉత్సవం

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 16 నవోదయ విద్యాలయ విద్యార్థులు ఇందులో పాల్గొని కళానైపుణ్యాలు ప్రదర్శించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాన్ని మంగళవారం విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విద్యా సామర్థ్యంతో పాటు వారిలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండురోజుల పాటు ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో 1. స్వర సంగీతం (క్లాసికల్, జానపదం, గిరిజన, భక్తి ప్రవత్తులు), 2. వాయిద్య సంగీతం (క్లాసికల్/ మెలోడిక్, ఆర్కెస్ట్రా సమిష్టి, జానపద/క్లాసికల్), 3. నృత్యం (క్లాసికల్ భారతదేశంలో ఏదైనా శాస్త్రీయ నృత్యరూప ప్రదర్శన, సమకాలీన కొరియోగ్రఫీ), 4.థియేటర్ (మోనో యాక్ట్, మిమిక్రీ, సమూహంతో ప్లే/డ్రామ), 5.విజువల్ ఆర్ట్స్ (డ్రాయింగ్, పెయింటింగ్, ప్రింటింగ్, కార్టూన్, క్యారికేచర్), 6.సంప్రదాయ కథ చెప్పడం (డ్యాన్స్, డ్రామా, సంగీతం, విజువల్స్ ఆర్ట్స్ ఒకటి కంటే ఎక్కువ కళారూపాలను కలుపుకొని సంప్రదాయ కథలు చెప్పడం)లో పోటీలు ఉంటాయన్నారు. 9వ తరగతి, 12 వ తరగతి విద్యార్థుల మధ్య జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కేరళలోని కోజిడ్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించే ప్రాంతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


జ్యోతి ప్రజ్వల చేస్తున్న విద్యాలయ ప్రిన్సిపాల్ ఇపద్మావతి


పెయింట్ పోటీల్లో విద్యార్థినులు

కర్నూలు మార్కెట్‌లో సజ్జల కొనుగోలుకు శ్రీకారం

- కనిష్ట ధర రూ.2211, గరిష్టం రూ.2611


సజ్జల కొనుగోలును ప్రారంభిస్తున్న సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్): సజ్జలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలకు శ్రీకారం చుట్టినట్లు మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందు తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన సజ్జల కొనుగోలు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. మొదటి రోజు మార్కెట్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఏడుగురు రైతులు 74 క్వింటాళ్ల సజ్జలు తీసుకురాగా వ్యాపారులు ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేశారు. క్వింటాకు కనిష్ఠంగా రూ.2,211, గరిష్టంగా రూ.2,611 ధర లభించింది. సగటున క్వింటా ధర రూ.2,431 పలికింది. ఈ సందర్భంగా సెక్రటరీ గోవిందు రైతులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో సజ్జ పంట 13,520 ఎకరాల్లో సాగయిందని, మార్కెట్‌కు ఎంత వచ్చినా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.